క్లుప్తంగా

దేశ రక్షణకు యువత సిద్ధం కావాలి



నారాయణపేట రూరల్ : దేశ రక్షణకు యువత ముందుండాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఆర్మీ బాడి అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు బాలరాజు అన్నారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియం లో నిర్వహిస్తున్న శిబిరాన్ని రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లు వీరేష్, సత్యనారాయణతో కలిసి బుధవారం పరిశీలించారు. నారాయణపేటలో ఉచితంగా శిక్షణ అందిరచడం శుభ పరిణామమన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆంజనేయులు, పీఈటీలు సాయినాథ్, అనంతసేనా, అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి కానిస్టేబుల్ అంబరీష్, లయన్స్‌క్లబ్ కోశాదికారి రవికుమార్‌గౌడ్, పీసీ సాయికుమార్ పాల్గొన్నారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కోస్గి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వేసవి కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు కరాటే మాస్టర్ వెంకట్ పటేల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు తమను సంప్రదించాలన్నారు.

కలుషితమవుతున్న తాగునీరు

మాగనూర్: మండల కేంద్రంలోని 10వ వార్డులో తాగునీటి పైపులైన్ మురుగకాల్వ వెంట ఉండడంతో లీకేజీ వల్ల నీరు కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. విషయంపై ఎవరూ పట్టించుకోవడం లేదని, ఎన్నిసార్లు విన్నవించినా కన్నెత్తికూడా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని తాగడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని అధికారులు స్పందించి లీకేజీని నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే మంజూరు చేసి వెంటనే తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషాకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా ప్రతి ఏడాది పదో తరగతి పూర్తి చేసిన అనంతరం సుమారు 600 వందల మంది విద్యార్థులు ఇంటర్ చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ల లేక చదువులకు స్వస్తి పలుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో జూనియర్ కాలేజీలను నిర్మిస్తామని పాలకులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అవినాష్, నాయకులు చందు, నవీన్, నాగరాజు, భాను పాల్గొన్నారు.

'ఆధార్' అప్‌డేట్ తప్పనిసరి

అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ చాంద్‌పాషా, కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన వారికి అప్పట్లో ఉన్న ముఖ కవలికలు, అడ్రస్‌లు గుర్తుపట్టలేని స్థితితో ఉన్నాయన్నారు. దీంతో పాటు రాష్ట్ర విభజన జరిగిన చాలా మంది ఇంకా ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఆధార్ కార్డులను కలిగి ఉన్నాయని, ప్రస్తుతం వాటిని పూర్తి స్థాయిలో మార్చేందుకు గాను ఆధార్‌ను అప్‌డేడ్ చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మున్సిపాలిటీలోని పది వార్డుల్లో వార్డుకు రెండు రోజుల ప్రకారం సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

అమరచింత: అమరచింత, మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి తొందరగా కోలుకోవాలని పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని నెలలుగా మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కనుమరుగైన అమరచింత నియోజకవర్గంతో పాటు మక్తల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించి ఈ ప్రాంత రైతుల కోసం ఎత్తిపోతల పథకాలను సాధించి పెట్టిన ఘనత దయాకర్‌రెడ్డిదే అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభ్యున్నతితో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఇప్పటికి ప్రజల్లో తనకంటూ చెదరని ముద్ర వేసుకున్న దయాకర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలంటూ అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోదీమనోహర్ రాజు, పట్టణ అధ్యక్షుడు గోపిరెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ పాల్గొన్నారు.

'ఉపాధి' కష్టాలు



ధన్వాడ శివారులో ఎండలో పనిచేస్తున్న కూలీలు

- నెలలుగా పెండింగ్‌లో కూలి డబ్బులు
- 5 కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి పనులు చేస్తున్న కూలీలు
- కనిపించని కనీస సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని అధికారులు

ధన్వాడ: 'ఉపాధి' హామీ పథకం ద్వారా పనులు కల్పించి పేదల కష్టాలు తొలగించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి నీరుగారుస్తున్నారు. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా చోద్యం చూస్తున్నారు. కొందరి తీరుతో ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో కూలీలు దాదాపు అయిదు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి పనులు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన కూలి డబ్బులు ఖాతాల్లో జమకాలేదు. ఒక్కటనేమీ మండలంలో ఉపాధి పనుల కోసం వెళ్తున్న కూలీల కష్టాలు చెప్పుకుంటూ పోతే చాంతాడంత జాబితా అవుతుంది. ధన్వాడ మండల కేంద్రం, రాంకిష్టాయిపల్లి తదితర చోట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మండల కేంద్రంలో కూలీలు నిత్యం అయిదు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి మణిపూర్ తండా గుట్టల్లో పనులు చేయాల్సి వస్తోంది. ఉదయం పూట ఎలాగోలా పనుల వద్ద వెళ్లినా మధ్యాహ్న సమయంలో తిరిగి వచ్చేటప్పుడు ఎండ దెబ్బకు తాళలేకపోతున్నామని కూలీలు వాపోతున్నారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడం లేదని కనీసం మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కూలి అందించాలి



రెండు నెలలుగా కూలి డబ్బులు రావడం లేదు. దీంతో ఇళ్లు గడవడం కష్టంగా మారింది. తప్పనిసరి పరిస్థితిలో అప్పులు చేసి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా పనులు చేసే వద్ద కూడా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి. కూలి డబ్బులు అందేలా చూడాలి.

–అనిత, ధన్వాడ

కనీస వసతులు కల్పించాలి



పనిచేసే ప్రదేశంలో ఎలాంటి వసతులు ఉండటం లేదు. మండుటెండల్లోనే పనులు చేస్తున్నాం. కనీసం మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచడం లేదు. పనికి సంబంధించిన సామగ్రి విషయంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. పనులు చేయడానికి నిత్యం అయిదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– వెంకటమ్మ, ధన్వాడ

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

కూలి డబ్బులు ప్రభుత్వం ఇదివరకే ఖాతాల్లో జమ చేసింది. కాగా కొంతమందికి సంబంధించిన బ్యాంక్ ఖాతాల విషయంలో సమస్యలు ఉన్నాయి. త్వరలోనే పరిష్కరించి డబ్బులు జమ అయ్యేలా చూస్తాం. అదేవిధంగా ప్రస్తుతం మెడికల్ కిట్లు, టెంట్లు రాలేదు. వచ్చిన వెంటనే అందుబాటులో ఉంచుతాం.

–సిద్దేశ్వర్, ఏపీఓ, ధన్వాడ

ఘనంగా స్వామివారి పల్లకీ సేవ

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా మొదటి రోజు స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఏటా మే నెలలో జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తెలంగాణతో పాటు మహరాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మరికల్‌లో క్షీరాభిషేకంలో పాల్గొన్న కార్మికులు

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించడంతో పట్టణంలో బుధవారం కేసీఆర్ చిత్రపటానికి మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించడంపై బుధవారం మరికల్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్మికులు బాల్‌రాజ్‌గౌడ్, పుల్లయ్యగౌడ్, మనోహర్‌గౌడ్, రామన్‌గౌడ్, బాలయ్యగౌడ్, తిరుతయ్య, రాములు, విజయ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: రాష్ట్రప్రభుత్వం గీత కార్మికులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించడంపై బుధవారం సంఘం నాయకులు జగదీష్‌గౌడ్, మహేష్‌గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

'మే డే పోరాట ఫలాలకు తూట్లు పొడుస్తున్నారు'



ఉద్మల్ గిద్దలో మాట్లాడున్న గోపాల్



కొండాపూర్‌లో మాట్లాడుతున్న బాల్‌రామ్

ధన్వాడ: మే డే పోరాట ఫలాలకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రామ్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో జెండా ఆవిష్కరించారు. మేడే స్ఫూర్తితో కార్మికులు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణయ్య, అనిత, అర్చన, ఎర్రన్న, నాగప్ప, గోపాల్, రాజు, చంద్రకళ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని ఉద్మల్‌గిద్దలో బుధవారం మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు, రైతుల ఆర్థిక పరిస్థితి దిగజారిందన్నారు. అంతకుముందు జెండాను ఎగర వేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ప్రకాష్, గ్రామ సర్పంచ్ విశాలాక్షి, నర్సిములు, భీంషప్ప, మల్లేష్, అశోక్, గోపాల్, లు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయండి

చిన్నచింతకుంట: ప్రభుత్వం అందించే రెండవ విడత గొర్రెల పంపిణీ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు ఉన్నాయని మండల కేంద్రానికి చెందిన శంకరయ్య, దామోదర్, శేఖర్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా పశు వైద్యాధికారి మధుసూదన్‌గౌడ్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడుతూ ఒకే కుటుంబంలో భార్యాభర్తలను ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం అవుతున్నారన్నారు. పశువైద్యాధికారి మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. అవకతవకలు ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏవైన తప్పిదాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కాల్వ పనులు పరిశీలించిన అధికారులు



ఊట్కూరు: మురుగుకాల్వ నిర్మాణ పనులను ఊట్కూర్‌లో బుధవారం అధికారులు పరిశీలించారు. బస్టాండ్ నుంచి మొగ్దుంపురం చౌరస్తా వరకు నిర్మించిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఈఈ నరేందర్, డీఈ మంగులాల్, ఏఈ జగత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

నర్వ: ఉపాధి నిధులు రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ నూతన భవనం పనులు నాణ్యతగా చేపట్టాలని ఈఈ నరేందర్ అన్నారు. బుధవారం కల్వాల్ గ్రామంలో నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనుల్లో నాణ్యమైన మెటీరియల్స్‌ను వాడాలని సూచించారు. పరిశీలనలో పంచాయతీరాజ్ డీఈ మంగులాల్, ఏఈ మారెప్ప తదితరులున్నారు.



మిల్లర్లు నిబంధనలు అతిక్రమించవద్దు



నర్వ: రైస్ మిల్లుల యజమానులు హమాలీ వసూలు చేస్తున్నారని రైతులు నర్వ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డితో వాపోయారు. అదనంగా ఒక కేజీ ఎక్కువగా ధాన్యం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ.. మిల్లర్లు నిబంధనలు తప్పకుండా పాటించాలని, రైతుల వద్ద నుంచి హమాలీ తీసుకోవద్దని, అదనంగా కేజీ ధాన్యం కూడా తీసుకోవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవన్నారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన



ఊట్కూర్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



ధన్వాడలో మాట్లాడుతున్న ఎంపీటీసీ

నర్వ: చిన్నారుల్లో పోషకాహారలోపాన్ని నివారించేందుకు కృషిచేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద కడ్మూర్, కల్వాల్, యాంకీ, సీపురం, రాయికోడ్, ఉందేకోడ్ గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై బుధవారం చిన్నపొర్లలోని రైతు వేదిక భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్ వాడీల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గుడ్లు పంపిణీ చేశారు. ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనయ్య, ఈసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: వేసవిలో చిన్నారులపై తల్లితండ్రులు శ్రద్ధ చూపాలని ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకట కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని కొల్లూరులో బుధవారం నర్సన్నతాత ఆలయం ముఖద్వారాన్ని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఎడివెల్లి గ్రామానికి చెందిన భక్తులు సుమారు రూ.15 లక్షల వ్యయంతో ముఖద్వారాన్ని నిర్మింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజాసమృద్ధి, ఎంపీటీసీ విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి, భక్తులు కుర్వ హన్మంతు, శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షంతో తప్పని తిప్పలు



ధన్వాడలో మొలకెత్తిన పంటను చూపిస్తున్న రైతు



జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ రోడ్డుపై నిలిచిన నీరు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వర్షానికి సివిల్‌లైన్, సాయివిజయ్ కాలనీ రోడ్, యాద్గీర్, హైదరాబాద్ రోడ్ వరద నీరు పారడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. కొత్తబస్టాండ్ ఆవరణలో నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే మినీ స్టేడియంలో వర్షపు నీరు నిల్వడంతో ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయింది. కూరగాయల మార్కెట్, ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రి రోడ్డులో వరద నీరు నిల్వడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

మొలకెత్తిన ధాన్యం

ధన్వాడ: నిరంతరాయంగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంట నీటమునిగి మొలకేత్తుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గున్ముక్ల గ్రామంలో కోత కోయడానికి సిద్ధంగా ఉన్న పంట వర్షానికి మొలకెత్తడంతో బుధవారం రైతు క్రాంతి మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని కోరారు.



బురదమయంగా వర్కూర్- నేరడగం రహదారి

బురదమయంగా రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్- నేరడగం ప్రధాన రహదారిపై వర్కూర్ గ్రామ ప్రారంభంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్డుపై వరద నీరు నిలిచిపోయింది. బురదమయంగా మారడంతో గ్రామస్తులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై బురదను తొలగించాలని గ్రామస్తులు , ప్రయాణికులు కోరుతున్నారు.

పల్లెల్లో కార్యదర్శులదే కీలక పాత్ర



మక్తల్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు



మద్దూర్‌లో కళ్లకు గంతలు కట్టుకొని..

మక్తల్: పల్లెల్లో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని జిల్లా ఎంపీటీసీల సంఘం ఉపాధ్యక్షుడు బాల్‌రాంరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో మద్దతు తెలిపి మాట్లాడారు.ఎంపీపీ వనజ, ఎంపీటీసీ సభ్యులు రంగప్ప, రామలింగప్ప, నర్సిరెడ్డి, తిమ్మప్ప, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలో కార్యదర్శుల సమ్మెకు తపస్ ఆధ్వర్యంలో నాయకులు మద్దతు తెలిపారు. సంఘం అధ్యక్షుడు రవీందర్, గౌరవ అధ్యక్షుడు భీంరెడ్డి, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి , రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెహందీ పెట్టుకుని నిరసన

నారాయణపేట రూరల్ : జిల్లాకేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు చేతులకు మెహందీ పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ముగ్గులకు బదులుగా జీపీల్లో వారు చేపట్టిన విధులను, అభివృద్ధి కార్యక్రమాలను రాసుకుని ఆందోళన చేపట్టారు. మధ్య తమను రెగ్యులర్ చేయాలనే నినాదంతో కూడిన ప్లకార్డు ఉంచారు.

మద్దూరు: పంచాయతీ కార్యదర్శులు బుధవారం 6 వ రోజు సమ్మెలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మహిళా పంచాయతీ కార్యదర్శులు చేతులకు మెహందీ పెట్టుకొని నిరసన తెలిపారు. నాగజ్యోతి, లక్ష్మి, కల్పన, నవీన, వెంకటేష్, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో మెహందీ పెట్టుకుని..

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

అమరచింత: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ జమీరుద్దీన్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో బుధవారం ఎస్పీ ఆదేశానుశారం ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. అపరచితులు ఎవరైనా ఫోన్‌చేసి మీ వ్యక్తిగత ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే ఇవ్వొద్దని తెలిపారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని, వాహనాలను నడుపుతూ మైనర్లు పట్టుబడితే బైక్ ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల కాగితాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించి తమ ప్రాణాలను కాపాడుకుంటూ తమ కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సమ్మె

మక్తల్: పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద 17వ రోజు వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇప్పటికైనా తమకు నెలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అదేవిధంగా ప్రమోషన్ ఇవ్వాలని, ఐడీ కార్డులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు ఇన్నాళ్లు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఆర్అండ్‌బీ డీఓ రాములు పర్యవేక్షణలో కాంట్రాక్టర్ పనులు తిరిగి చేపట్టారు. నాలుగు నెలల క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించుకొన్న లబ్ధిదారులు, స్థానికులు రోడ్డు పనులు ప్రారంభంపై ఎదురుచూస్తుండగా స్థానిక ప్రజా ప్రతినిధుల చొరవతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రెండు పాత రోడ్డు తొలగింపు, లేవలింగ్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలియజేస్తున్నారు.



మానవత్వం చాటుకున్న డీసీసీ అధ్యక్షుడు

నర్వ: జిల్లా డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మానవత్వం చాటుకున్న ఘటనిది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో వివిధ శుభకార్యాలలో పాల్గొని పాథర్చేడ్ వద్ద ఆయన వెళ్తున్న సమయంలో అటుగా స్కూటీపై వెళ్తున్న మహిళలు అదుపుతప్పి పడిపోయారు. వారికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన ఆయన వారిని తన స్వంత వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేశారు.